# ప్రణాళికలు.. అభివృద్ధి.. పరిశీలన

**20వ శతాబ్దం ముందు చాలాకాలంగా అభివృద్ధి స్తంభించిపోయింది. దాంతో తర్వాత చేపట్టిన ప్రణాళికల్లో ఆర్థిక వృద్ధికి పెద్దపీట వేశారు. మన దేశంలో 1991లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థూల ఆర్థిక స్థిరీకరణకు ప్రాధాన్యమిచ్చింది. ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ఇప్పటివరకు అమలుచేసిన ప్రణాళికల వల్ల మిశ్రమ ఫలితాలు వచ్చాయి. 'వనరుల పంపిణీ సక్రమంగా లేకపోవడంతో ప్రణాళికా లక్ష్యాలను సాధించడం కష్టమైంది'. గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమివ్వడం ద్వారా అసమానతలు రూపుమాపడానికి ప్రణాళికాపరమైన కృషి ఎంతో అవసరం.**

భారతదేశంలో మిశ్రమ ఆర్థిక వ్యవస్థ నేపథ్యంలో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించారు. అనేక డాక్యుమెంట్ల ఆధారంగా ఆర్థిక ప్రణాళికల దీర్ఘకాల లక్ష్యాల్లోని తేడాను గమనించవచ్చు. ఏడో పంచవర్ష ప్రణాళిక వరకు ఆర్థికవృద్ధి, స్వయం సమృద్ధి, నిరుద్యోగ నిర్మూలన, ఆదాయ అసమానతల తొలగింపు, పేదరిక నిర్మూలన, ఆధునికీకరణ అనేవి ప్రణాళికల దీర్ఘకాల లక్ష్యాలు. నాలుగో ప్రణాళిక వరకు ఆర్థికవృద్ధి (నికర జాతీయ ఉత్పత్తిలో వార్షిక పెరుగుదల 5 శాతం)కి అధిక ప్రాధాన్యమివ్వగా.. ఐదు, ఆరో ప్రణాళికల్లో స్వయం సమృద్ధి, ఉద్యోగ కల్పన, పేదరిక నిర్మూలనకు ప్రాముఖ్యతనిచ్చారు. 1991 జూన్ లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థూల-ఆర్థిక స్థిరీకరణ సాధనకు పెద్దపీట వేయడంతో భారత ఆర్థిక వ్యవస్థ 'మార్కెట్ ఆధారిత వ్యవస్థ'గా రూపుదిద్దుకుంది.

ప్రణాళికాయుగం మొత్తాన్ని పరిశీలించినపుడు.. ప్రభుత్వం అవలంభించిన విధానాలను కింది విధంగా వర్గీకరించవచ్చు.

- పారిశ్రామికీకరణ తక్కువగా ఉన్న ప్రాంతాలకు సంబంధించిన విధానాలు.
- నీటి పారుదల, వ్యవసాయం, సంబంధిత కార్యకలాపాల అభివృద్ధి కోసం విధానాలు.
- వెనుకబడిన ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలైన రవాణా, సమాచారానికి సంబంధించిన విధానాలు.
- ప్రాంతీయ అసమానతలు తగ్గించే విధంగా కేంద్రం నుంచి రాష్ట్రాలకు వనరులు ప్రణాళిక, గ్రాంట్ల రూపంలో ప్రణాళికేతర సహాయం.
- వెనుకబడిన, తక్కువ అభివృద్ధి చెందిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు.

పారిశ్రామిక లైసెన్సింగ్ విధానం అభివృద్ధిచెందిన రాష్ట్రాలకే అనుకూలంగా ఉండడంతో నిర్దేశిత లక్ష్య సాధనలో విఫలమైంది. పారిశ్రామిక ఆర్థిక సంస్థలు కూడా అభివృద్ధి చెందిన రాష్ట్రాలకే అనుకూలంగా వ్యవహరించాయి. ప్రణాళికాయుగంలో వ్యవసాయరంగ అభివృద్ధికి కోసం ప్రారంభించిన 'అధిక దిగుబడినిచ్చే వంగడాల కార్యక్రమం' వల్ల ఆహారధాన్యాల ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగింది. పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో గోధుమ ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగింది. తద్వారా ప్రాంతీయ

అసమానతలు పెరిగాయి. విద్య, ఆరోగ్య రంగాలపై ప్రణాళికా కేటాయింపులు తక్కువైనందువల్ల మానవాభివృద్ధి లోపించింది. భూసంస్కరణలు సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల ఆర్థిక అసమానతలు పెరిగాయి.

### వాలంటరీ హెల్త్ అసోసియేషన్ నివేదిక 2008 :

అంతర్జాతీయ ప్రమాణాలతోపోల్చినపుడు.. సగటు ఆరోగ్యస్థాయి దేశంలో తక్కువగా ఉంది. ఈ రంగంపై తలసరి వ్యయం కూడా తక్కువే. దేశంలో రాష్ట్రాల మధ్య ఆరోగ్య ప్రమాణాల్లో తేడాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. మొత్తం జనాభాలో 18.8 శాతం కలిగిన కేరళ, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల ఆరోగ్య సూచికలు అభివృద్ధి చెందిన, మధ్య ఆదాయ దేశాలైన వెనిజులా, అర్జెంటీనా, సౌదీ అరేబియాలతో సమానంగా ఉన్నాయి. మరోవైపు 42 శాతం జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, అస్సాం, రాజస్థాన్, బీహార్, జార్ఖండ్‌లో ఆరోగ్య సూచికలు సబ్ సహారా ఆఫ్రికా దేశాలు, ఇతర అల్పాదాయ దేశాలైన సూడాన్, నైజీరియా, మయన్మార్‌తో సమానంగా ఉన్నాయి.

దేశంలో ప్రతి వెయ్యి మంది జనాభాకు 0.6 మంది అల్లోపతి డాక్టర్లు ఉన్నారు. వీరు ఎక్కువగా దక్షిణాది రాష్ట్రాలు, అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో కేంద్రీకృతమయ్యారు. వీరి సంఖ్య ఉత్తరప్రదేశ్‌లో కంటే పంజాబ్‌లో 5 రెట్లు ఎక్కువ. గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో కంటే అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో వీరి లభ్యత ఎక్కువ. మెడికల్ కళాశాలల ఏర్పాటులో కూడా అసమానతలు ఉన్నాయి. దేశంలోని మొత్తం మెడికల్ కళాశాలల్లో 63 శాతం, మొత్తం సీట్లలో 67 శాతం 4 దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి. నేషనల్ శాంపుల్ సర్వే అభిప్రాయంలో 1995-96, 2003-04 మధ్య పట్టణ ఆస్పత్రుల్లో 126 శాతం, గ్రామీణ ఆస్పత్రుల్లో 78 శాతం వ్యయం పెరిగింది.

### మొదటి ప్రణాళిక (1951 ఏప్రిల్ 1-1956 మార్చి 31) :

దేశంలో ప్రజల జీవన ప్రమాణాన్ని మెరుగుపరచడం మొదటి ప్రణాళిక ప్రాథమిక లక్ష్యం. సహజ వనరుల సక్రమ వినియోగం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించవచ్చని భావించారు. ఈ ప్రణాళిక మొత్తం వ్యయం రూ. 2,069 కోట్లు. ఈ మొత్తాన్ని వ్యవసాయ, పారిశ్రామిక, శక్తి, నీటిపారుదల, రవాణా, సమాచారం, సాంఘిక సేవా రంగాలకు కేటాయించారు. స్థూల దేశీయోత్పత్తి వృద్ధి సగటు 2.1 శాతం లక్ష్యం. కాగా వాస్తవంగా 3.6 శాతం సాధించారు. దీన్ని పూర్తిగా 'విజయవంతమైన ప్రణాళిక'గా పేర్కొనవచ్చు. ఈ ప్రణాళికా కాలంలో మెట్టూర్, హీరాకుడ్, బాక్రానంగల్ డ్యామ్ లాంటి నీటిపారుదల ప్రాజెక్టులు ప్రారంభించారు. వ్యవసాయంపై ఆధారపడిన భూమి లేని శ్రామికుల పునరావాస సౌకర్యాల కల్పన పట్ల ప్రభుత్వం శ్రద్ధ వహించింది. అనేక సహకార సంస్థల ద్వారా వ్యవసాయం రంగంలో నూతన పరిజ్ఞానం వినియోగించుకోవడానికి వీరికి శిక్షణ ఇచ్చారు. తంతి తపాలా, రైల్వే సర్వీసులు, రోడ్లు, సివిల్ ఏవియేషన్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేసింది. పారిశ్రామిక రంగానికి అవసరమైన నిధులు

కేటాయించారు. దీంతో పాటు చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి అదనపు చర్యలు తీసుకున్నారు.

**రెండో ప్రణాళిక(1956 ఏప్రిల్1–1961 మార్చి 31వరకు):**

రెండో పంచవర్ష ప్రణాళికలో పారిశ్రామిక రంగానికి ప్రాధాన్య మిచ్చారు. ముఖ్యంగా భారీ పరిశ్రమలు ప్రాధాన్యం పొందాయి. పారిశ్రామిక వస్తూత్పత్తి ప్రభుత్వ రంగంలో ఎక్కువగా జరిగింది. 1953లో మహలనోబిస్ రూపొందించిన నమూనా ఆధారంగా రెండో ప్రణాళికను రూపొందించారు. ఆర్థికాభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలకు ఈ నమూనా సమాధానమిచ్చింది. దీనిప్రకారం ఆర్థిక వ్యవస్థ 'నియమిత ఆర్థిక వ్యవస్థ'గా ఉండి రెండు రంగాలను కలిగి ఉంటుంది.

1. వినియోగ వస్తు రంగం
2. మూలధన వస్తు రంగం

ఇలాంటి నియమిత ఆర్థిక వ్యవస్థలో మూలధనం కొరతగా ఉంటుంది. మూలధన వస్తు లభ్యతపై పెట్టుబడులు ఆధారపడి ఉంటాయి. మూలధన వస్తూత్పత్తిని వినియోగ వస్తూత్పత్తి ప్రభావితం చేయలేదు. ఈ నమూనా ప్రకారం అనేక ఉత్పాదక రంగాల్లో నిధుల పంపిణీకి ప్రాధాన్యమివ్వాలి. దీర్ఘకాలంలో ఈ పెట్టుబడుల ద్వారా అధిక ప్రతి ఫలం పొందడం ఈ నమూనా లక్ష్యం. దుర్గాపూర్, జంషెడ్‌పూర్, భిలాయ్‌లతో పాటు మొత్తం ఐదు ఉక్కు కర్మాగారాలు ఈ ప్రణాళికలో ఏర్పాటయ్యాయి. హైడ్రోఎలక్ట్రిక్ ప్లాంట్లు ఏర్పాటుచేశారు. బొగ్గు ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. దేశంలో రైల్వేట్రాక్‌ల సంఖ్య నార్త్ ఈస్టర్న్ ప్రాంతంలో పెరిగాయి. అటామిక్ ఎనర్జీ కమిషన్‌ను 1957లో ఏర్పాటు చేశారు. ఇదే కాలంలో 'టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్' ఏర్పాటైంది. ప్రతిభావంతులైన వ్యక్తులను గుర్తించడానికి ఈ ఇన్‌స్టిట్యూట్ అనేక కార్యక్రమాలు నిర్వహించింది. అణుశక్తికి సంబంధించిన కార్యక్రమాల్లో వీరికి భాగస్వామ్యం కల్పించారు.

**మూడో ప్రణాళిక (1961 ఏప్రిల్ 1–1966 మార్చి 31) :**

స్వయంసమృద్ధి గల ఆర్థికవ్యవస్థను రూపొందించే లక్ష్యంతో ఈ ప్రణాళిక ప్రారంభమైంది. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమిచ్చారు. కాని 1962లో చైనా–భారత్ యుద్ధ సమయంలో దేశ భద్రత వైపు ప్రభుత్వ దృష్టి మళ్లింది. తర్వాత 1965,1966 మధ్యకాలంలో హరిత విప్లవంలో భాగంగా వ్యవసాయంపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. చైనా–భారత్ యుద్ధం వల్ల అనేక ఉత్పత్తుల ధరలు పెరిగాయి. దీన్ని వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణంగా భావించవచ్చు. ఈ కాలంలో అనేక ఎరువుల, సిమెంట్ తయారీ కర్మాగారాలు నెలకొల్పారు. పంజాబ్‌లో గోధుమ ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రోత్సహించే చర్యలో భాగంగా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించారు. సెకండరీ విద్యకు సంబంధించి అనేక విభాగాలు

ఏర్పాటయ్యాయి. రాష్ట్ర విద్యుత్ బోర్డుల ఏర్పాటు ఈ ప్రణాళికలో భాగమే. రోడ్ల నిర్మాణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించారు.

### మూడో ప్రణాళిక లక్ష్యాలు :

- జాతీయాదాయంలో వార్షిక పెరుగుదల 5.6 శాతం.
- వ్యవసాయ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి.
- నిరుద్యోగాన్ని తగ్గించడం.
- ప్రజలందరికీ సమాన హక్కులు.

చైనా, పాకిస్థాన్‌లతో యుద్ధాలు, చమురు ధరల పెరుగుదలతో చెల్లింపుల శేషంలో అసమతౌల్యం తీవ్రమైంది. దీన్ని పూర్తిగా విఫలమైన ప్రణాళికగా భావించవచ్చు. ప్రణాళికలు ప్రారంభమైన మొదటి 15 ఏళ్లల్లో పారిశ్రామిక రంగంలో గమనించిన నిర్మాణాత్మక మార్పు వనరుల కేటాయింపులో వినియోగ వస్తు పరిశ్రమల స్థానంలో మూలధన వస్తు పరిశ్రమలకు ప్రాధాన్యతనివ్వడం. మూడో ప్రణాళిక లక్ష్యాల సాధనలో విఫలమైనందువల్ల 4వ ప్రణాళిక వెంటనే ప్రకటించకుండా ప్రణాళికా విరామం(1966–69) పాటించారు.

### వార్షిక ప్రణాళికలు 1966–69 :

మూడు వార్షిక ప్రణాళికల మొత్తం వ్యయం రూ.6,625 కోట్లు. కాగా దీనిలో 22.8 శాతం పరిశ్రమలు, ఖనిజాలకు కేటాయించారు. మిగతా వ్యయంలో 18.5 శాతం రవాణా, సమాచార రంగం,18.3 శాతం శక్తి, 16.7 శాతం వ్యవసాయ రంగానికి కేటాయించారు. ప్రణాళికా కేటాయింపుల్లో శక్తి రంగానికి మొదటి ప్రణాళికలో 7.6 శాతం, రెండో ప్రణాళికలో 9.7 శాతం, మూడో ప్రణాళికలో 14.6 శాతం కేటాయించగా వార్షిక ప్రణాళికల్లో ఈ రంగానికి కేటాయింపు ఎక్కువగా ఉండటం గమనించవచ్చు. విద్యుత్ కొరత ఎక్కువగా ఉండి పారిశ్రామిక ఉత్పత్తి ప్రతికూలంగా ఉన్నందువల్ల వార్షిక ప్రణాళికల్లో శక్తి రంగానికి కేటాయింపులు పెంచారు.

### నాలుగో ప్రణాళిక: (1969–1974):

ఈ ప్రణాళికా కాలంలో.. భారతదేశ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ. ఆమె ప్రభుత్వం ఈ ప్రణాళికాలోనే 14 వాణిజ్య బ్యాంకులను జాతీయం చేసింది. స్థిరత్వంతో కూడిన వృద్ధి... వ్యవసాయ ఉత్పత్తుల్లో ఒడిదుడుకులు తగ్గించడం.. అనిశ్చిత విదేశీసహాయం వల్ల కలిగే ప్రభావాలను తగ్గించడం– ఈ ప్రణాళిక ముఖ్యలక్ష్యాలు. ప్రజల జీవన ప్రమాణస్థాయిని మెరుగుపరిచేందుకు ఉపాధి, విద్య, సమానత్వం, సాంఘిక న్యాయసాధనలపై దృష్టిపెట్టారు. సంపద కొన్ని వర్గాలకే పరిమితం కాకుండా చర్యలు తీసుకున్నారు. మొత్తం ప్రణాళిక వ్యయంలో.. ప్రభుత్వ రంగ వాటా 60 శాతం. కాగా, విదేశీ సహాయం

13 శాతం. వ్యవసాయం, నీటిపారుదల రంగానికి 23 శాతం పోగా.. మిగతా మొత్తాన్ని విద్యుత్, పరిశ్రమలు, రవాణ రంగాలకు కేటాయించారు. ఈ ప్రణాళికలో జాతీయాదాయ వృద్ధి రేటు లక్ష్యం సగటున 5.7 శాతం. కాగా 3.3 శాతం మాత్రమే సాధ్యమైంది. వ్యవసాయ ఉత్పత్తి వార్షిక వృద్ధి 2.8 శాతం.. పారిశ్రామిక ఉత్పత్తిలో వార్షిక వృద్ధి 3.9 శాతంగా నమోదైంది. స్వయంసమృద్ధి లక్ష్యంలో భాగంగా ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగింది. ఈ ప్రణాళికలోనే వ్యవసాయరంగంలో హరిత విప్లవం సంభవించింది. ఇండియా- బంగాదేశ్ వివాదం (1971), బంగ్లాదేశ్ కాందిశీకుల సమస్యల వల్ల ఆర్థిక ప్రగతి క్షీణించింది.

## ఐదో ప్రణాళిక (1974-1979):

ఈ ప్రణాళిక ప్రారంభంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉంది. ఆ ప్రభావం భారత్‌పైనా పడింది. దేశం లో తీవ్ర ద్రవ్యోల్బణం ఏర్పడి ఇంధనం, ఆహార రంగంలో ధరలు విపరీతంగా పెరిగాయి. దాంతో వనరుల కేటాయింపులో ఈ రెండు రంగాలకు పెద్దపీట వేశారు.

**లక్ష్యాలు...**

- పేదరిక నిర్మూలన.. ఆర్థికవృద్ధిని వేగవంతం చేయడం.. ప్రాంతాల మధ్య అసమానతలను తొలగించడం..
- భూ సంస్కరణల సక్రమ అమలు ద్వారా వ్యవసాయ రంగ స్థితిగతులు మెరుగుపరచడం.
- సమీకృత కార్యక్రమాలతో స్వయంఉపాధి పెంచడం.
- చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించడం.
- దిగుమతులకు ప్రత్యామ్నాయ వ్యూహం అవలంభించడం.
- పారిశ్రామిక రంగంలో పరపతికి విధానాలు రూపొందించడం.
- దేశంలో శ్రమ సాంద్రత- ఉత్పత్తి పరిజ్ఞానాన్ని మెరుగుపరచడం.

**ఫలితాలు:**

వ్యవసాయరంగంలో స్వయంసమృద్ధి సాధించడంతో ఆహారధాన్యాల సరఫరా పెరిగింది. ఖనిజాల ఎగుమతులు పెరిగి.. విదేశీ మారక ద్రవ్య రాబడి హెచ్చింది. 1975-విద్యుత్ సరఫరా చట్టం కారణంగా.. కేంద్ర ప్రభుత్వానికి విద్యుత్ ఉత్పాదన, ట్రాన్స్‌మిషన్‌లో పాలుపంచుకునే అవకాశం కలిగింది. 1978లో జనతా ప్రభుత్వం ఐదో ప్రణాళికను రద్దు చేసి.. నిరంతర ప్రణాళిక ప్రవేశపెట్టింది. దీన్ని రూపొందించింది గున్నార్ మిర్డల్.

## ఆరో ప్రణాళిక (1980-1985):

పేదరికాన్ని తగ్గించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిపెంచాలని ఈ ప్రణాళిక లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకోసం వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు అవస రమైన మౌలిక సౌకర్యాలను మెరుగుపరచాలని

నిర్ణయిం చారు.

**ప్రణాళిక లక్ష్యాలు...**

- నిరుద్యోగ నిర్మూలన.
- పేదల జీవన ప్రమాణస్థాయి పెంచడం.
- ఆదాయ, సంపదలో వ్యత్యాసాలు తొలగించడం.
- స్వయంసమృద్ధి దిశగా ఆర్థిక వ్యవస్థ పురోగమించడం.

ఈ లక్ష్యాల సాధనకు నాలుగు రంగాలకు ప్రాధాన్యమి చ్చారు. అవి... 1) వ్యవసాయ రంగం, 2) కుటీర, చిన్న తరహా పరిశ్రమలు, 3) సమీకృత గ్రామీణాభివృద్ధి కోసం ప్రాంతీయ ప్రణాళిక, 4) కనీస అవసరాలు కల్పించడంతోపాటు టూరిజం (పర్యాటక రంగం), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాల అభివృద్ధిని కూడా లక్ష్యంగా నిర్ణయించుకుంది.

**ఫలితాలు...**

రవాణా, సమాచార వ్యవస్థ చెప్పుకోదగ్గ పురోగతిని సాధించింది. జాతీయ రహదారులను అభివృద్ధి చేశారు. అనేక కొత్త జాతీయ రహదారులను నిర్మించారు. ఇది దేశంలో ట్రాఫిక్ వ్యవస్థ మెరుగుకు దోహదపడింది. అంతేకాకుండా.. విదేశీ పర్యాటకులు పెరగడంతో... దేశం పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకొంది. తొలిసారిగా ఆర్థిక సరళీకరణ విధానాలను ప్రవేశ పెట్టారు. జనాభా నియంత్రణకు సంబంధించి ప్రజల్లో అవగాహన పెంచే చర్యలు చేపట్టారు. అందుకోసం కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను అమలు చేశారు. ధరలపై నియంత్రణను ఎత్తివేయడంతో ఆహారధరలు విపరీతంగా పెరిగాయి. ఫలితంగా ప్రజల జీవన వ్యయం కూడా పెరిగింది.

## ఏడో ప్రణాళిక (1985–1990):

ఈ ప్రణాళిక నినాదం.. ఆహార-పని-ఉత్పాదకత. మొత్తం వ్యయం రూ.2,18,729.62 కోట్లు. ఇందులో ప్రభుత్వ రంగ వాటా రూ.1,80,000 కోట్లు. పారిశ్రామిక అభివృద్ధి సాధించడం ద్వారా.. అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చోటు సాధించాలన్నది ఈ ప్రణాళిక ప్రాథమిక లక్ష్యం. ఆహారధాన్యాల ఉత్పత్తి పెంచడం ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం.. దాంతోపాటు ఉత్పాదకత పెంచడానికి అవసరమైన కార్యక్రమాలకు పెద్దపీట వేశారు. నిరుద్యోగాన్ని తగ్గించడం ద్వారా పేదరికాన్ని నిర్మూలించాలని నిర్ణయించారు. అందుకోసం ఏప్రిల్ 1, 1989న జవహర్‌రోజ్‌గార్ యోజనను ప్రారంభించారు. చిన్నతరహా, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. బాలికల్లో విద్యావ్యాప్తికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

**లక్ష్యాలు..**

- వార్షిక వృద్ధిరేటు 5 శాతం సాధించడం.
- వ్యవసాయరంగ వృద్ధి లక్ష్యం 4 శాతం.
- పారిశ్రామిక రంగ వృద్ధి లక్ష్యం 8 శాతం.
- దారిద్ర్య రేఖ దిగువనున్న జనాభాను తగ్గించడం.
- 40 మిలియన్ల ప్రజలకు ఉపాధి అవకాశాలు.
- నిరక్షరాస్యత తగ్గించడం.
- కనీస అవసరాలు కల్పించడం.

**ఫలితాలు...**

టెలికాంరంగం చెప్పుకోదగ్గ పురోగతిని సాధించింది. జీడీపీ వృద్ధిరేటు 5.8 శాతంగా నమోదైంది. ఆహారధాన్యాల ఉత్పత్తి 3.23 శాతం పెరిగింది. 1991, జూన్‌లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. ఎనిమిదో ప్రణాళికను ఏప్రిల్ 1, 1992 నుంచి అమలుచేయాలని నిర్ణయించింది. 1990-91, 1991-92లకు వార్షిక ప్రణాళికలను అమలు చేశారు. వీటిలో ఉపాధి అవకాశాలను విస్తృతపరచడం, సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌కు ప్రాధాన్యత నిచ్చారు.

## ఎనిమిదో ప్రణాళిక (1992-97):

ప్రణాళిక మొత్తం వ్యయం రూ. 4,34,100 కోట్లుగా నిర్ణయించినా... చివరికి రూ.4,95,669 కోట్లకు పెరిగింది. నిర్మాణాత్మక సర్దుబాట్లు, స్థూల స్థిరీకరణ విధానాల నేపథ్యంలో.. ప్రణాళిక ప్రారంభమైంది. 1990-91లో ద్రవ్యోల్బణ పరిస్థితులు, చెల్లింపుల శేషంలో పెరిగిన లోటు... స్థూల స్థిరీకరణ విధానాల అమలుకు దారి తీసింది. ఇది.. ద్రవ్యోల్బణ సంక్షోభాలను నివారించి... అధికవృద్ధి సాధించడానికి తోడ్పడింది.

**లక్ష్యాలు:**

- వార్షిక వృద్ధిరేటు లక్ష్యం 5.6 శాతం.
- దారిద్ర్య రేఖ దిగువనున్న జనాభాలో 10 శాతం తగ్గింపు.
- ప్రతి వ్యక్తికి ఆహారధాన్యాల లభ్యతను వార్షిక సగటున 195 కిలోలకు పెంచడం.
- 2012 నాటికి దేశంలో అందరికి ఉపాధి అవకాశాలు
- 15- 35 ఏళ్లలోపు వారిలో నిరక్షరాస్యత నిర్మూలన
- 1995 నాటికి అందరికీ పరిశుభ్రమైన నీరు
- అందరికి ప్రాథమిక విద్యను అందించడం.

**ఫలితాలు...**

అధిక ఆర్థికవృద్ధి సాధించగలిగాం. తయారీ రంగం, వ్యవసాయం, సంబంధిత రంగాల్లో అధిక వృద్ధి, ఎగుమతి, దిగుమతుల్లో వృద్ధి కనిపించింది. ట్రేడ్, కరెంట్ అకౌంట్ లోటు తగ్గి.. కేంద్ర ప్రభుత్వ ద్రవ్య లోటులో తగ్గుదల సాధ్యమైంది. వార్షిక సగటు వృద్ధి 6.8 శాతం. ప్రణాళిక మొత్తం పెట్టుబడిలో వ్యవసాయం, అనుబంధరంగాలకు 14.3 శాతం, శక్తికి 28.7 శాతం, రవాణా, కమ్యూనికేషన్స్‌కు 19.61 శాతం, నీటిపారుదల, వరద నివారణకు 7.2 శాతం కేటాయించారు.

**9,10,11 ప్రణాళికలను పరిశీలిస్తే స్థూలంగా... విద్య, ఆరోగ్యం, ఉపాధి లాంటిసంక్షేమ రంగాలకు పెద్దపీట వేశారు. అంతేకాకుండా అన్ని గ్రామాలకు తాగు నీటి వసతి, టెలిఫోన్ సౌకర్యం.. దారిద్ర్యరేఖ దిగువన నివసించే కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం, జనాభా నియంత్రణ వంటి వాటికి కూడా ప్రాధాన్యతనిచ్చారు..**

## 9వ ప్రణాళిక (1997-2002):

రాబోయే సంవత్సరాల్లో ఆర్థికాభివృద్ధి సాధనలో భాగంగా ఆర్థికవనరులను అభిలషణీయ స్థాయిలో వినియోగించుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రణాళికను రూపొందించింది. పేదరిక నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా.. సాంఘిక రంగానికి ప్రభుత్వ సహాయాన్ని పెంచాల్సిన అవసరాన్ని ప్రణాళికా రచయితలు గుర్తించారు. సామాజిక న్యాయం, సమానత్వంతో కూడిన వృద్ధి ఈ ప్రణాళిక లక్ష్యం. మొత్తం పెట్టుబడి రూ.22,05,000 కోట్లుగా నిర్ణయించారు. దీనిలో ప్రభుత్వరంగ పెట్టుబడి రూ.8,59,200 కోట్లు. ఇందులో కేంద్ర స్థూల బడ్జెటరీ మద్దతు రూ.3,74,000 కోట్లు. ప్రభుత్వరంగ సంస్థల వనరులు రూ.2,90,000 కోట్లు. కాగా రాష్ట్ర ప్రభుత్వాల వనరులు రూ. 1,95,000 కోట్లు.

**లక్ష్యాలు :**

- త్వరితగతిన పారిశ్రామికీకరణ సాధించడం.
- ధరల స్థిరీకరణ.
- అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించడం.
- జనాభా పెరుగుదలను నియంత్రించడం.
- ఆహార ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించడం.
- ఉత్పాదక ఉద్యోగిత పెంపునకు వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం.
- ఆహార భద్రత కల్పించడం.
- పేదరికాన్ని తగ్గించడం.
- పంచాయతీరాజ్ సంస్థలు, సహకార సంఘాలు, స్వయం సహాయక బృందాల అభివృద్ధికి ప్రోత్సాహమివ్వడం.

•వార్షిక వృద్ధి రేటు 6.5 శాతం సాధించడం.

**ఫలితాలు :**

ఈ ప్రణాళికలో నిర్దేశిత వృద్ధిలక్ష్యం 6.5 శాతం. కాగా 5.4 శాతం సాధించాం. వ్యవసాయం, తయారీ రంగం లో వృద్ధిరేటు తగ్గగా సేవారంగంలో కొంతమేరకు పెరిగింది. సుమారు మూడేళ్ల వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం వ్యవసాయ రంగంలో తగ్గుదలకు కారణం. 1997లో ఆసియా దేశాల సంక్షోభం, ప్రపంచ ఆర్థిక వృద్ధి మందగించడం, 1997-2000 మధ్య వ్యవసాయరంగంలో వృద్ధి లేకపోవడం వల్ల పారిశ్రామిక ఉత్పత్తులకు డిమాండ్ తగ్గింది. ఒరిస్సాలో తుఫాన్, గుజరాత్‌లో భూకంపం, కార్గిల్ యుద్ధం కారణంగా మొత్తం పెట్టుబడి నుంచి వనరుల బదలాయింపు వల్ల వృద్ధిరేటు మందగించింది. మార్కెట్ ధరల వద్ద స్థూల దేశీయోత్పత్తిలో పెట్టుబడి రేటు 24.2 శాతం. కాగా పొదుపు రేటు 23.3 శాతంగా నమోదైంది. పొదుపు రేటు కంటే పెట్టుబడి రేటు ఎక్కువైనందువల్ల కరెంట్ అంకౌంట్‌లో లోటు జీడీపీలో 0.9 శాతంగా ఉంది. 2001-02లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ద్రవ్యలోటు జీడీపీలో 8.7 శాతానికి పెరిగింది. ఈ ప్రణాళికలో చెల్లింపుల శేషంలో స్థితి మెరుగైంది. ఎగుమతుల వృద్ధి లక్ష్యం11.8 శాతం. కాగా 5.6 శాతం మేర పెరుగుదల నమోదయింది. దిగుమతుల వృద్ధి లక్ష్యం 10.8 శాతం. కాగా 4.1 శాతం మేర పెరిగాయి. ముఖ్యంగా తయారీ రంగంలో సామర్థ్య వినియోగం తగ్గింది. ఉన్నత, సాంకేతిక విద్యకు సంబంధించి అనేక యూనివర్సిటీలు ఏర్పాటు చేశారు. ప్రధానమంత్రి సూచించిన ప్రాధాన్యతలకనుగుణంగా రూపొందించిన Special Action Planను ఈ ప్రణాళి క ప్రత్యేక లక్షణంగా పేర్కొనవచ్చు. ఇది ఆహారం, వ్యవసాయం, భౌతిక అవస్థాపన, ఆరోగ్యం, విద్య, తాగు నీరు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, నీటివనరులకు ప్రాధాన్య మిస్తుంది.

## 10వ ప్రణాళిక (2002-07) :

ఈ ప్రణాళిక స్థూల దేశీయోత్పత్తిలో వార్షిక వృద్ధి రేటు 8శాతం సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. మొత్తం ప్రణాళికా పెట్టుబడి రూ. 15,92,300 కోట్లు. ఇందులో కేంద్ర వాటా రూ. 9,21,291 కోట్లు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వాటా రూ. 6,71,009 కోట్లు.

**లక్ష్యాలు :**

•2007 నాటికి అక్షరాస్యత, వేతన రేటులో స్త్రీ, పురుషుల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించాలి.

•ఐదేళ్లలో 50 మిలియన్ల ఉద్యోగాలు కల్పించడం, ఏడాదికి కోటి మందికి ఉపాధి.

•వ్యవసాయ, అనుబంధరంగాల వృద్ధిలక్ష్యం 3.97 శాతం

•తయారీ రంగ వృద్ధి లక్ష్యం 9.82 శాతం.

•2007 నాటికి అక్షరాస్యత రేటును 75 శాతానికి పెంచడం.

- 2012 నాటికి తలసరి ఆదాయాన్ని రెట్టింపు చేయడం.
- అన్ని గ్రామాలకు తాగునీటి సౌకర్యం.
- 1999-2000లో శిశు మరణాల రేటు ప్రతి వెయ్యి జననాలకు 72 కాగా.. దీనిని 2007 నాటికి 45కు తగ్గించడం.
- 2007 నాటికి మొత్తం భూ విస్తీర్ణంలో 25 శాతం అటవీ విస్తీర్ణం సాధించడం.
- జనాభా వృద్ధి 2001 – 2011 లోపు 16.2 శాతం ఉండేలా చూడడం.
- 2003 నాటికి పిల్లలందరిని పాఠశాలల్లో చేర్పించి.. 2007 నాటికి వారు ఐదేళ్ల పాఠశాల విద్య పూర్తిచేసేలా చూడడం.
- శ్రామిక శక్తికి అదనంగా తోడయ్యేవారికి లాభదాయకమైన, అధిక నాణ్యత గల ఉపాధి అందించడం.

**ఫలితాలు :**

ఈ ప్రణాళికలో స్థూల దేశీయోత్పత్తి వృద్ధిరేటు 7.8 శాతంగా నమోదైంది. రవాణా, సమాచారరంగాల్లో అత్యధికంగా 15.3 శాతం వృద్ధి నమోదయింది. వ్యవసాయం, అనుబంధరంగాలు 2.5 శాతం, తయారీ రంగం 8.6 శాతం, నిర్మాణరంగం 12 శాతం వృద్ధిని సాధించాయి. గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్యరేఖకు దిగువన నివసించే కుటుంబంలో ఒకరికి సంవత్సరంలో 100 రోజుల ఉపాధి కల్పన ధ్యేయంగా 'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని' తీసుకువచ్చారు. పనిచేసే ఆసక్తి, సామర్థ్యమున్న అందరికీ తర్వాత కాలంలో ఈ పథకాన్ని విస్తరించారు. స్థూల దేశీయ పొదుపు 2002-03లో జీడీపీలో 26.4 శాతం నుంచి 2006-07లో 34.8 శాతానికి పెరిగింది. దేశీయ పొదుపు సగటు జీడీపీలో 31.4 శాతం. ఈ ప్రణాళికలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మారిషస్, అమెరికా, యు.కె.ల నుంచి ఎక్కువగా వచ్చాయి. ముఖ్యంగా తయారీ రంగం, ఫైనాన్షియల్ సర్వీసులు, బ్యాంకింగ్ సర్వీసులు, ఐటీసర్వీసులు, నిర్మాణరంగం ఎక్కువగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించాయి.

## 11వ ప్రణాళిక (2007-2012):

**లక్ష్యాలు:**

**ఆదాయం, పేదరికం**

- ▶జీడీపీ వృద్ధిరేటు లక్ష్యం 9 శాతం(2016-17 నాటికి తలసరి ఆదాయం రెట్టింపు చేయాలంటే 12వ ప్రణాళికలో జీడీపీ వృద్ధి 10 శాతం ఉండాలి).
- ▶వ్యవసాయ రంగ వృద్ధిలక్ష్యం 4 శాతం.
- ▶70 మిలియన్ల మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు కల్పించడం.
- ▶విద్యావంతుల్లో నిరుద్యోగం 5 శాతం కంటే తక్కువ ఉండాలి.
- ▶సుశిక్షితులు కాని శ్రామికుల వాస్తవిక వేతన రేటు 20 శాతం మేర పెంచాలి.

▶జనాభా నిష్పత్తి ఆధారంగా లెక్కించిన వినియోగ పేదరికాన్ని 10 శాతం తగ్గించాలి.

**•విద్య**

▶ప్రాథమిక విద్యలో Dropout rateను 2011-12నాటికి 20 శాతానికి తగ్గించాలి.(ఇది 2003-04లో 52.2శాతం).

▶7 ఏళ్ల పైనున్న వారిలో అక్షరాస్యత రేటును 85 శాతానికి పెంచాలి.

▶ స్త్రీ,పురుషుల మధ్య అక్షరాస్యత వ్యత్యాసాన్ని 10 శాతం తగ్గించాలి.

▶ప్రణాళిక పూర్తయ్యేనాటికి ఉన్నత విద్యనభ్యసించే వారి ప్రస్తుత శాతం 10. దీన్ని 15 శాతానికి పెంచాలి.

**•ఆరోగ్యం**

▶ప్రతి వెయ్యి జననాలకు శిశుమరణాల రేటు 28, ప్రసూతి మరణాల నిష్పత్తి 1కి తగ్గించాలి.

▶మొత్తం సంతానసాఫల్యత రేటును 2.1కి తగ్గించాలి.

▶2009 నాటికి అందరికి శుభ్రమైన తాగునీరు అందించాలి.

▶ప్రణాళికాంతానికి పౌష్టికాహారలోపంతో ఇబ్బంది పడుతున్న 0-3 వయోవర్గంలోని పిల్లలు, రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు, బాలికల శాతాన్ని సగానికి తగ్గించాలి.

**•మహిళలు, పిల్లలు**

▶0-6 వయోవర్గానికి సంబంధించి లింగనిష్పత్తి 2011-12 నాటికి 935, 2016-17 నాటికి 950కు పెంచాలి.

▶ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల్లో 33 శాతం మహిళలు, బాలికలు ఉండాలి.

▶ఎటువంటి నిర్బంధం లేకుండా సురక్షితమైన బాల్యాన్ని పిల్లలందరూ అనుభవించాలి.

**•మౌలిక సౌకర్యాలు**

▶2009 నాటికి అన్ని గ్రామాలకు, దారిద్ర్యరేఖ దిగువన ఉన్న అన్ని కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలి.

▶నవంబర్ 2007 నాటికి అన్ని గ్రామాలకు టెలిఫోన్ సౌక ర్యం, 2012 నాటికి బ్రాడ్‌బాండ్ కనెక్టివిటీ కల్పించాలి.

▶2009 నాటికి 1000 మంది, ఆపైన జనాభా ఉన్న అన్ని హాబిటేషన్‌లకు, 500 జనాభా కలిగిన పర్వత, ట్రైబల్ ప్రాంతాలకు రోడ్ల సౌకర్యం.

▶2012 నాటికి అందరికి నివేశనా స్థలాలు (house sites) కల్పించాలి. 2016-17 నాటికి గ్రామీణ పేదలందరి గృహనిర్మాణానికి తోడ్పాటునందించాలి.